# మానవత్వం

(నాటిక)

త్రిపురనేని రమేష్

శతపతి, ధర్మారావు, బలరామయ్య గదిలోకి ప్రవేశిస్తారు. ధర్మారావు లాల్చీ జేబులో దిన పత్రిక, వార పత్రిక లుంటాయి.

శ: అబ్బ! ఈ దయ్యాల కొంపలో రాజకీయాలేమిటండీ?

బ: నీకు తెలియదులే కుర్రకుంకవి! రాజకీయాలు మాట్లాడ్డానికి అనువైన తావులు ఇలాంటివే. (ధర్మారావు వైపు తిరిగి) ఏమంటారు బావగారూ?

ధ: అసలు బసవరాజుగారేరి?

(జోగారావు వచ్చేస్తాడు)

జో: (కుడివైపు ద్వారం వైపు చూపి) ఆ గదిలో వున్నారు. స్నానాల గదులూ అవీ లోపలే వున్నాయి. (మధ్య తలుపు వైపు చూపి) ఈ గదిలో నాలుగు రోజులకు సరిపోయే మంచినీళ్ళున్నాయ్! వేళకి ఫలహారాలు, భోజనాలు అందుతాయి.

బ: దేనికయ్యా ఇవన్నీ మాకు చెబుతున్నావ్?

శ: ఏమిటీ! నాలుగు రోజులు మేము ఇక్కడే వుండాలా? (రావు అనుమానంగా నిలబడి వుంటాడు. జోగారావు అతడ్ని చూసి నెమ్మదిగా బయటివైపుకు నడుస్తూ చివరికి పారిపోతాడు. బయట వరండా తలుపులు వేసిన చప్పుడు.)

ధ: జోగారావ్ (ఎడమవైపు తలుపు గుండా వెళతాడు. బయట తలుపులు కొట్టిన చప్పుడు. "జోగారావ్! జోగారావ్!" అన్న ధర్మారావు కేకలు. బలరామయ్య, శతపతి వస్తారు)

బ: ఏమిటలా గొంతు చించుకు అరుస్తాడు? (ఇద్దరూ ఎడమ వైపు ద్వారం గుండా వెళతారు)

బ: స్వరం: ఇదేంది తలుపు వేశాడు? ఏయ్! జోగారావ్! ఆటగా వుందా? తియ్యహే - తీస్తావా ఎముకలిరగదన్నాలా?

(ధర్మారావు నిరాశగా లోపలికి ప్రవేశిస్తాడు)

శ: స్వరం: అబ్బబ్బా, మీరూరుకోండి! మీరలా మాట్లాడితే భయపడి పారిపోతాడు. జోగారావు గారూ! నాకోసమయినా తలుపు తీయండి. కొత్తగా పెళ్ళయినవాడ్ని. అవతల నా వందనం ఎదురు చూస్తూ వుంటుంది. చాలా కాలమయ్యిందిగా. ఎక్కడుండమన్నా వుంటారు. (అని మధ్య ద్వారం గుండా వెళ్తాడు)

శ: (క్షణంలో తిరిగి వచ్చి) ఆ గదిలో ఒక్క తలుపైనా లేదు తప్పించుకోడానికి, పెసరంత సందయినా లేదు.

బ: (తిరిగి వచ్చి) వెనక తలుపులూ బిగించారు. బలమయిన తలుపులేమో ఎంత తన్నినా అంగుళమయినా కదలడం లేదు.

ధ: వాళ్ళంత తెలివితక్కువ వాళ్ళా, తంతే వూడే తలుపులున్న ఇంట్లో బంధించడానికి?

శ: ఈ ప్రాంతానికెవరూ రారు కూడానండీ! జోగారావువాళ్ళు వచ్చి తలుపులు తీస్తేగాని బయట పడలేము.

బ: ఆ బసవరాజు కేదేం బుద్ధి? మనల్నిక్కడ దాచాడు? మనమంతా అతని పార్టీవాళ్ళమేగా?

శ: మధ్యలో మారతామని భయపడి ఎలక్షన్లయేదాకా ఇక్కడే వుంచుతాడో ఏమో! నాలుగు రోజులకి సరిపడా నీళ్ళున్నాయని చెప్పాడుగా జోగారావ్ ! నాలుగు రోజులు! అమ్మో నాలుగు రోజులు విరహమే.

ధ: మనల్ని దాచింది బసవరాజు కాదు-గజపతి!

బ: వాడా!

శ: ఆ జోగారావ్ బసవరాజు మనిషేనండీ!

ధ: అని ఇంతకాలం మనల్నీ, బసవరాజుని నమ్మించాడు. అతడు గజపతి మనిషే! ఇంతకాలం మనల్ని నమ్మించి, సరిగ్గా ఎలక్షన్ల ముందు బయటపడ్డాడు. అంతేగానీ మన ఓటు పడదనే అపనమ్మకంగానీ, కనీసం అనుమానమైనా బసవరాజుకి వుండదు.

శ: నిజమేనండీ! ఆయనకి మనమీదెందుకుంటుందండీ అనుమానం. దూరం ఆలోచించకుండా ఆ జోగారావుగాడ్ని నమ్మి ఇంతదూరం వచ్చాం!

బ: అసలు ఆడు అనుమానం రానిస్తేనా? ఎంత చక్కగా ఆడాడు నాటకం! "మనవాళ్ళతో బసవరాజుగారు రహస్య సమావేశం అవుతున్నారు, మిమ్మల్ని వెంటనే తీసుకురమ్మన్నారు" అనగానే వెంటబడి వచ్చాం- ఇంట్లో ఇవాళ కోడి కోయించాను. బావగారూ! మీకు తెలుసుగా మీ చెల్లెలు కోడి కూర ఎలా వండుతుందో! అహ! ఆ వాసన! (ఆ వాసన వస్తున్నట్టుగానే గట్టిగా ఒక్కసారి పీల్చి తన్మయుడౌతాడు)

శ: ఎంతసేపూ తిండీ! తిండీ!

బ: (శతపతి మీదకి వెళ్తూ) కాక పెళ్ళాం అనాలా?

శ: (భయంగా) లేదండీ... 'తిండీ తిండీ' అనాలండీ!

బ: (పొట్ట నవరించుకుని) ఆకలి, ఆకలి!

శ: ఆ గదిలో నీళ్ళున్నాయ్-ఏం చేస్తాం? దాంతో కడుపు నింపుకోండి! వాళ్ళు భోజనం తెచ్చి పడేసే దాకా!

*ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన చనిపోయిన డాక్టర్ త్రిపురనేని రమేష్‌బాబు శ్రీ గోపీచంద్ కుమారుడు. మరణించే నాటికి రమేష్‌బాబు వయస్సు 46 సంవత్సరాలు. మొదట మార్క్సిస్టుగా ప్రారంభమై తర్వాత 'హ్యూమనిస్టు'గా పరిణామం చెందారు. కొంతకాలం ఇంగ్లండ్‌లో డాక్టర్‌గా పని చేశారు.*

*డాక్టర్ రమేష్ ఎన్నో నాటకాలు రాశారు. అందులో ఈ 'మానవత్వం' అనే చిన్న నాటిక ఒకటి. మనిషిలో మానవత్వం అనేది ఏ పరిస్థితిలో బతకగలుగుతుందో, ఎటువంటి పరిస్థితిలో చచ్చిపోతుందో అన్నదాన్ని రచయిత ఇందులో నాటకీయంగానూ, అవాస్తవికం అనిపించేట్టుగాను చిత్రించారు.*

మనిషిని మనిషే పీక్కు తినడం అన్నదాన్ని గురించి బూసన్ ఒక కథలో చిత్రించారు. అలాగే 'యజ్ఞం' కథలో సీతారాముడు తన కొడుకును నిలువునా నరికేసిన సంఘటన వుంది. ఈ సందర్భాలకు ఈ నాటికలోని అంశం కొంత పోలికలో వుంది.


డాక్టర్ రమేష్‌బాబు సంస్మరణగా ఈ నాటికను సమర్పిస్తున్నాము.



బ: ఇంతకింతా పగ తీర్చుకుంటాను! బయటపడనీ! ఆ గజపతి, జోగారావుల బొమికల్లో సున్నం లేకుండా వేస్తాను. (అంటూ మధ్య తలుపుగుండా వెళ్ళిపోతాడు)

శ: (ధర్మారావుని చూసి మూలకెళ్ళి విరిగిన చెక్కల్లోంచి ఒక ఓటి కుర్చీ తెచ్చి వేస్తాడు) కూర్చోండి!

(బలరామయ్య వస్తాడు)




ధ: మరి మీరో!

శ: మీరు కూర్చోండి పెద్దవారు, మాదేముంది- ఎక్కడ కూర్చున్నా ఫర్వాలేదు!

బ: శతపతీ! ఇంకో కుర్చీ వుందేమో చూడవోయ్!

శ: లేదండీ!

బ: లేదంటే ఎలాగోయ్!

ధ: పోనీ దీనిమీద నువ్వే కూర్చో.

బ: ఎందుకులే, నువ్వే కూర్చో పెద్దవాడివిగా (అంటూ విసురుగా ఎడమ తలుపుగుండా వెళతాడు. ధర్మారావు దినపత్రిక విప్పి చదువుతుంటాడు. శతపతి మధ్య తలుపుగుండా వెళ్ళి గ్లాసు చేతబట్టుకొచ్చి)

శ: ధర్మారావుగారూ! మంచినీళ్ళు తాగండి.

ధ: (అందుకుని తాగుతాడు.)

శ: (ఖాళీ గ్లాసు అందుకుని వెళ్ళబోయి ఏదో గుర్తుకువచ్చి వెనక్కు తిరిగి) బలరామయ్యగారూ! మీకూ మంచినీళ్లు కావాలా? (అంటూ ఎడమ తలుపు గుండా వెళ్తాడు.)

బ: పోయహే!

శ: (పరుగున వెనక్కి వచ్చేస్తాడు.)

ధ: (విరునవ్వుతో) భోజనం పడేదాకా అతడ్ని పలకరించకు శతపతీ.

శ: వాళ్లెప్పుడు తెస్తారో భోజనం (అంటూ నిట్టూర్చి మధ్య తలుపు గుండా వెళ్ళి క్షణం తర్వాత చొక్కాతో మూతి తుడుచుకుంటూ వచ్చి)- ధర్మారావుగారూ, మన ఓటు గజపతికి వేస్తామన్నా మనర్ని విడిచిపెట్టరా?

ధ: శతపతీ! ఏమిటి నువ్వంటున్నది? ఈ నాలుగు రోజుల సుఖం కోసం అలాంటివాడికి ఓటువేసి గెలిపించి ఈ జిల్లా బోర్డు ప్రెసిడెంట్‌ను చేస్తావా? ప్రజల్ని అలాంటి స్వార్థపరుల పరిపాలన క్రింద పడేస్తావా? ఇందుకేనా మనర్ని వాళ్ళు ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నది?

శ: (గాద్గదికంగా) నేను ప్రెసిడెంట్‌గా నిలబడలేదండీ, రెండు పార్టీలవాళ్ళూ రాజీ చేసుకుని నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు! ప్రెసిడెంటైతే గొప్పనుకున్నాను గానీ ఇలాంటి గొడవలొస్తాయనుకోలేదు ధర్మారావుగారూ! నా మాట వినండి! ఈ ఒక్కసారికి వాళ్ళకు ఓటు వేసేద్దాం.

బ: (వచ్చి) ఏమన్నావ్?

శ: మన ఓటు గజపతికి వేద్దామంటున్నాను.

బ: (శతపతి మీదికెల్తూ) నీ ఓటు గజపతికి వేస్తావా?

శ: లేదండీ! నేనెందుకు వేస్తాను? వెయ్యను! వెయ్యనండీ.

(బలరామయ్య కదుల్తాడు)

శ: (దీనంగా) నమస్కారం.

(బలరామయ్య ధర్మారావు దగ్గరకెళ్ళి దినపత్రికల్లో ఓ పత్రిక తీసుకుని ఒక వైపు వేసుకు కూర్చుంటాడు.)

శ: పేపరు తీసుకుంటే చదవడానికేమో అనుకున్నాను ధర్మారావుగారూ! ఆ వారపత్రిక ఇలా ఇవ్వండి. చదవడానికి కాదులేండి. బొమ్మలు చూస్తాను.

ధ: (వార పత్రికతో పాటు దినపత్రికలోని ఒక కాయితం ఇచ్చి) ఇది వేసుకుని నువ్వూ కూర్చో!

శ: (అవి అందుకుని, పేపరు ఒకవైపు పరచుకుని కూర్చుంటాడు.)

బ: అయితే శతపతీ! ఈ ప్రాంతాలకెవరూ రారంటావా?

శ: మనుషులు రారుకానండీ! పాములు, నక్కలు, తోడేళ్లు, అడవిపందులు, దయ్యాలు వస్తాయండి.

బ: (భయంగా గుటక మింగి) దయ్యాలా- ఇలాంటి చోట ఇల్లెవరు కట్టారయ్యా! మన కొంప ముంచడానికి.

శ: జమిందారొకడు కట్టుకున్నాడండీ వేసవి విడిదిగా. వేసవి రోజుల్లో సిబ్బందితోపాటు వచ్చి ఇక్కడ వుండేవాడట. పగలంతా వేటాడి తెచ్చిన వాటిని చక్కగా వండించుకుని సుష్టుగా తినేవాడుట.

బ: (గుటకలు వేస్తూ) ఏమైనా జమీందారుల అదృష్టమే అదృష్టం. (పొట్ట నవరించుకుని) ఆకలి! (లేచి మధ్య తలుపుగుండా వెళతాడు)

శ: ధర్మారావుగారూ! మరే వాళ్లట కన్నెపిల్లల్ని ఇక్కడికి ఎత్తుకొచ్చి మానం దోచుకుని, ప్రాణం తీసి ప్రక్క చెరువులో పారేసేవారటండీ. వాళ్ళేం మనుషులో. పండంటి కన్నెపిల్లల్ని చంపడానికి మనసెట్టా ఒప్పేదోనండీ.

ధ: ధన మదం శతపతీ! ధన మదం.

శ: మరేనండీ. డబ్బున్నోళ్లు అంతేనండి. ఈ రోజుల్లోనూ కొంతమంది డబ్బున్నోళ్ళు విందులో ఇరవై కూరలుండాల్సిందే!

బ: ఇరవై కూరలే! (అని నీళ్ళు త్రాగడానికి వెళతాడు.)

శ: అన్ని కూరలెందుకు చెప్పండి? రెండు మూడు కూరలు చేసుకుని తృప్తిగా తినక. అన్నీ దండుగమారి పనులు.


ధ: వాళ్ళకవి హోదా!

శ: అలాంటివాళ్ళను తీసుకొచ్చి నాలుగైదు రోజులు పస్తు పడేస్తేగాని బుద్ధి రాదు. వాళ్ళు అలా విచ్చలవిడిగా వుండబట్టే కదండీ ధరలన్నీ ఇలా పెరిగిపోతున్నాయ్.

ధ: (విరునవ్వుతో) ఏమో అనుకున్నా, నువ్వూ ఆలోచిస్తావ్ శతపతీ.

(బలరామయ్య వచ్చి కూర్చుంటాడు)

శ: ఆలోచించడమే కాదండీ- ఆచరిస్తా కూడా. మొన్న నా పెళ్ళిలో మూడు బుట్టల లడ్లు మిగిలాయండీ.




(ధర్మారావు విసుగ్గా లేచి లోపలకెళ్తాడు. శతపతి నిరుత్సాహపడ్తాడు.)

బ: లడ్లు మూడు బుట్టలే!

శ: లెక్కా డొక్కా లేకుండా చేయించినందుకు వాళ్ళకు పెట్టానండి చివాట్లు. అవన్నీ బీదలకు పంచేద్దామన్నానండీ! కానీ వందనం అలా వీల్లేదంది. వందనం మాట నేను కాదన్లేను చూడండీ!


బ: అయితే అవి ఇంట్లోనే వున్నాయా?

శ: వున్నాయండి.


బ: మరి ఇంకా ఆగావేం? వెంటనే వెళ్ళి ఓ బుట్ట పట్టుకురా.

శ: (ఆనందంగా) వెళ్ళనాండీ. అలాగే వందనాన్ని చూసొస్తా.

బ: త్వరగా వెళ్ళిరా.
శ: వెళుతున్నానండీ? తలుపులు?
బ: ఔను. జోగారావ్, గజపతి మీరు కనబడ్డారంటే నమిలిపారేస్తా! శతపతీ! తిండి మాటెత్తావంటే తాట వలుస్తా.
(శతపతి నిట్టూర్చి పేపరు మీద పడుకుని వార పత్రిక తిప్పుతూ వుంటాడు.)
బ: వాళ్ళకింత ధైర్యమెలా వచ్చింది? వాళ్ళ వెనక అంత అండుందా?
శ: వుండబట్టే మరి? (ఒక బొమ్మ చూసి) బలరామయ్యగారూ! ఈ అమ్మాయిని చూడండి! మా ఆవిడ పోలికలున్నాయి కదండీ?
బ: పోయహే.
శ: (భయంగా పడుకుంటాడు. క్షణం తర్వాత వారపత్రిక తీసి ఆ బొమ్మను చూసి కౌగలించు కుంటాడు. బలరామయ్య చుట్ట వెలిగిస్తాడు.)
(లైట్స్ ఆఫ్)
(ధర్మారావు కుడివైపు తలుపుగుండా నీరసంగా ప్రవేశిస్తాడు. కుర్చీలో కూర్చోబోయి అంతలో లేచి నేలమీద పడుకుంటాడు. పొట్ట చేత్తో పట్టుకుని "అమ్మా! అబ్బా" అంటూ మూలుగుతుంటాడు. శతపతి మధ్య తలుపు గుండా ప్రవేశిస్తూ-)
శ: నడిచే శక్తి కూడా లేకుండా పోయింది. ఇంక నీళ్ళు తాగే యోగం కూడా వుండదు. నాలుగైదు రోజులైతే చచ్చిపోతాం కూడా- ధర్మారావుగారూ! వాళ్ళు రారంటారా? మన గతి ఇంతేనా? మనకు చావు తప్పదంటారా? తిండి మొహం చూసి అప్పుడే నెల రోజులైపోయింది.
(ధర్మారావు తలెత్తి శతపతివైపు చూసి, మళ్ళీ తల వాల్చుకు పడుకుంటాడు. శతపతి తూలుతూ కుడి




వైపు తలుపుగుండా లోపలికెళతాడు. శతపతి వెళ్ళ గానే ధర్మారావు ఆత్రుతగా దూరంగా పడి వున్న పేపరు దగ్గరకు వెళ్ళి ఒక్క ముక్క చింపుకుని నోట్లో వేసుకుని నములుతుంటాడు. బలరామయ్య కుడివైపు తలుపుగుండా వస్తాడు.)
బ: ఏమిటి తింటున్నావ్?
ధ: (పేపరు అడ్డం పెట్టుకుని చదువుతున్నట్టు నటిస్తూ నోట్లో వున్న పేపరు నమిలేస్తాడు.)
బ: చావబోయేవాడికి చదువేమిటి? (అని పేపరు లాగి) చెప్పండి-ఏమిటి మీరు తింటున్నది?
ధ: (ఏమీ లేదన్నట్టు తల వూపుతాడు.)
బ: ఏమీ లేదూ?
ధ: (లేదన్నట్టు మళ్ళీ తల వూపుతాడు.)
బ: లేదనక వుందని ఎలా అంటారు? తిండి కదూ! దాచుకుని మెల్లగా మెక్కాలని కదూ? మీరొక్కరు బ్రతికి బయటపడాలని కదూ(అంటూ బలవంతాన బుగ్గ మీద వేళ్ళతో నొక్కి నోరు తెరిపించి చూస్తాడు. అతడి తల విసురుగా తోసేసి) మింగే శావ్. అదేమిటో తెలియనివ్వకుండా రవ్వంతైనా లేకుండా మింగేశావు. అదేమిటో నాకు పెడతావా లేదా? (గట్టిగా చొక్కా పట్టుకుంటాడు.)
ధ: ఇదెక్కడి గోల? ఏం లేదంటే నమ్మవేం?
బ: నిన్ను నమ్మాలా? నా కళ్ళ ఎదుటే నమిలి మింగేసిన నిన్ను నమ్మాలా? ఒక్కడివే బ్రతకాలను కునే నిన్ను నమ్మాలా? బ్రతుకు ఎలా బతుకుతావో బతుకు (అంటూ గొంతు పట్టుకు పిసుకు తుంటాడు.)
ధ: బలరామయ్యా! బలరామయ్యా! (అంటూ పెనుగులాడి చివరికి అతని పట్టు విడిపించుకుని దూరంగా వెళతాడు.) బ... బలరామయ్యా! నేను తిన్నది పేపరు.
(అవమానంతో కూడిన ఏడుపుతో కూలబడి పోతాడు)
బ: పేపరా? కాదు నువ్వు బుకాయిస్తున్నావ్ (అంటూ మీదకెళ్తాడు.)
ధ: నిజం నా మాట నమ్ము (అంటూ చకచకా పాక్కుంటూ వెళ్ళి పేపరందుకుని) కావాలంటే ఇక్కడ చూడు-చింపి వుంది.
బ: నిజమేనా? బావగారూ? తింటానికేమైనా దొరి కితే నా మాట మర్చిపోకండి-లేకపోతే లేకపోతే మీ చెల్లెలు ముండమోస్తుంది. (ఏడుస్తూ ఎడమ వైపు ద్వారం గుండా వెళ్తాడు.)
ధ: ఇంకెక్కడ దొరుకుతుంది తిండి? దొరికినా ఆకలితో వున్నవాడికి ఆప్తులు గుర్తుంటారా? తిండి (విషాదంతో కూడిన నవ్వుతో వెళ్ళి కుర్చీలో కూర్చుని పేపరు చింపుకుని తినబోతాడు. అసహ్యం వేసి పారేస్తాడు. గొంతు సవరించుకుని బల రామయ్య వెళ్ళినవైపు కోపంగా చూస్తాడు.)
శ: (విసురుగా తూలుతూ వచ్చి) బలరామయ్య ద్రోహం చేశాడు. స్నానాల గదిలో పెట్టిన నాదంతా తినేశాడు. మనకు చెప్పకుండా తినేశాడు దున్న పోతు. (ధర్మారావు బలరామయ్య వెళ్ళిన వైపు కోపంగా చూస్తాడు) మనకు ఏనాటికైనా మిగల్చ లేదు గాడిద. అంతా నాకిపారేశాడు పంది- వేలుపెట్టి అన్నంలోకి నములుకుంటూ) దేవుడా! ముందు వాడ్నే పంపేయ్! దేవుడు! హా-దేవుడు ఒరేయ్! దేవుడా! ఎక్కడున్నావురా-ఒరేయ్





జగన్నాటక సూత్రధారీ! రా రా రా మమ్మల్ని కన్నుల పండుగ్గా చూడరా. (పెద్దపెట్టున పిచ్చివాడిలా నవ్వుతాడు. కాసేపటికి నవ్వు ఏడుపుగా పరిణమిస్తుంది.) చూడరా! చూడు. (అని ఏడుస్తూ కూలబడి పోతాడు.)
ధ: శతపతీ! ఏమిటీ ధోరణి-పిచ్చెక్కినట్టు?
శ: పిచ్చి! అంత అదృష్టమా-పిచ్చెక్కితే ఈ నరక యాతన లేకుండా హాయిగా చచ్చిపోతాం. ఏం అలా చూస్తున్నారు-చావంటే భయంగా వుందా? చిన్న వాడ్ని నాకు లేని భయం మీకెందుకు? చస్తారు- మీరు చస్తారు-నేనూ చస్తాను-అందరూ చస్తారు. చావంటే ఏమనుకున్నారు? దేవత! మృత్యు దేవత! దానికందరూ సమానమే. "బ్రతికుంటే మనిషి మానవత్వం సాధించలేడు పాపం" అని చంపే స్తుంది! చంపి-అందర్నీ సమానం చేస్తుంది. (అని పిచ్చిగా నవ్వుతాడు.)
ధ: శతపతీ!!
శ: ఇంకెక్కడి శతపతి! వున్న ఒక్క పెళ్ళానికి పతి లేకుండా పోతుంటే- పెళ్లాం! దాన్ని మర్చేపోయాను! ఔను - మర్చిపోతాం? తిండి లేకపోతే పెళ్ళాం ఎందుకు?
బ: (వస్తూ) రావడంలేదు! ఇంకా రావడంలేదు. ఎంత చూసినా రావడంలేదు.
శ: ఎవరూ? చావా?
బ: (విసుగ్గా) కాదు, వాళ్ళు జోగారావ్ వాళ్ళు.
ధ: నువ్వు చూస్తున్నావుకదాని వాళ్ళు వస్తారా?
శ: రారు! వాళ్ళు రారు-మనల్ని చంపాలనే ఇక్కడ పెట్టారు.
బ: చంపాలనా? మరి నాలుగైదు రోజుల్లో వస్తానని, తిండి తెస్తానని చూశాడుగా ఆ జోగారావ్?

శ: కూశాడు కానీ రాలేదుగా (శతపతిని పట్టుకు వూపుతాడు)

శ: ఇందుకే, ఇందుకే రాలేదు. వాళ్ళను తంతాను, చంపుతాను అన్నారుగా?

బ: అన్నానా? ఎందుకన్నాను? ఇంకెప్పడూ అనను.

శ: అనరా-వాళ్లొస్తే తన్నరా?




బ: తన్నను.

శ: ఏం చేస్తారు.

బ: వాళ్లేం చేయమంటే అదే చేస్తాను.

ధ: కాళ్ళు పట్టుకోమంటే?

బ: కాళ్ళా?

శ: పట్టుకోరా?

బ: ఆ-పట్టుకుంటాను.

శ: ఇంకేం! పదండి చెబుదాం.

(రెండడుగులు ఇద్దరూ ఎడమ ద్వారం వైపు వేస్తారు)

ధ: ఆగండి! తలుపువేసి లేదూ?

శ: ఔను.

బ: ఔను.

(ఇద్దరూ నిరాశగా కూర్చుండిపోతారు)

శ: మనకు చావు తప్పదు.

బ: చావా?

శ: ఏం! నామతిన్నంత మాత్రాన బ్రతికిపోతాననుకున్నారా?

బ: లేదు. నేను చావను నేను చావను. (అంటూ లేచి ఎడమ ద్వారం గుండా వెళ్తాడు. తలుపులు తంతూ వున్న చప్పుడు.)

శ: (శక్తినంతా కూడదీసుకుని బలరామయ్యకు వినిపించేలా) ఎంత తన్నినా ఆ తలుపు వూడదు. చావు లాగే దానికి ఏమన్నా లెక్కలేదు.

బ: (ఏడుస్తూ తిరిగి వచ్చి నేల మీద పడుకుని పొట్ట పట్టుకుని దొర్లుతూ వుంటాడు. మధ్య గదిలో నుంచి ఏదో చప్పుడు విని చెవులు రిక్కించుకుని వింటాడు.) ఏదో చప్పుడవుతోంది!(మధ్య ద్వారం వైపు చూపి) అక్కడెవరో వున్నారు.

శ: వున్నారు-ఎలుకగారు. ఆ గదిలో కాపురం చేస్తున్నారు. మనిషికన్నా ఎలుకే నయం. కంత మూస్తే ఇంకో చోట తవ్వుకుని తప్పించుకు పోతుంది.

బ: ఎలుక! దాంట్లోనూ వుంటాయి రక్తమాంసాలు- తినేస్తా! దాన్ని తినేస్తా! (అని చెప్పు పట్టుకుని ఆ గదిలోకి పరిగెడతాడు. లోపల కర్రతో, చెప్పుతో కొడుతున్న చప్పుడు. ధర్మారావు ఒక క్షణం ఆలోచించి లేచి అటువైపు వెళ్ళిపోతుండగా వాళ్ళు మొహాలు వేలాడేసుకుని రొప్పుతూ, తూలుతూ వస్తారు.)

ధ: ఏమైంది?

శ: ఏమవుతుంది? "నేను మీ అంత చాతకానిదాన్ని కాను" అన్నట్టుగా గునగునా పరుగెత్తిపోయింది.

బ: కుళ్ళుమోతులు. ఎక్కడ తినిపోతానోనని మీద బడి వచ్చారు.

ధ: నేనందుకు రాలేదు.

బ: ఎందుకొచ్చావో?

ధ: (కాసేపు నీళ్ల నమిలి) నీళ్ళు తాగుదామని.

శ: నీళ్ళా? అక్కడ నీళ్ళయిపోయి ఎన్నాళ్లయ్యింది? స్నానాల గదిలో నీళ్ళే గతి!


ధ: (కుడివైపు తలుపుగుండా వెళ్తాడు.)

శ: (కుర్చీలో వాలిపోయి)మనం ఇంకేమీచెయ్యలేం. మనకు చావు తప్పదు. చస్తాను. చచ్చి దయ్యాన్నయి ఆ జోగారావ్, గజపతులను పీక్కు తింటాను.

బ: పీక్కుతింటాను.

శ: కడుపునిండా తింటాను. కసితీరా తింటాను. ఏం! మీకూ కావాలా? అయితే చావు-చచ్చి దయ్యమై పీక్కుతిను.

బ: తినొచ్చు (అనుకుని శతపతివైపు చూసి నాలుక చప్పరిస్తాడు. .ధర్మారావ్ వస్తాడు.) వీడొకడు మధ్యలో వీడికి భాగం కావాలంటాడు. ఎంతివ్వాలి. వాడికి ఒక వంతు, నాకు రెండు వంతులు అయితేనే



ఇస్తాను.


(ధర్మారావు కుర్చీ దగ్గరకొస్తాడు)

శ: (అతన్ని క్రింద కూర్చోమని సంజ్ఞ చేస్తాడు)

ధ: ఔన్లే-చావబోయేవాడికి మర్యాదలేమిటి? (వెళ్ళబోతాడు)

శ: రండి మీరు కూర్చోండి. నేను లోపలికెళ్ళి కుండ కౌగలించుకు పడుకుంటాను. పొట్ట కాస్త చల్లబడు తుంది. (వెళ్తాడు)

బ: చల్లబడుతుంది. పొట్టే కాదు ప్రాణమే చల్లబడు తుంది. (నవ్వుకుని ధర్మారావుతో) నీకిప్పడే చెబుతున్నా- నీకు ఒక వంతు, నాకు రెండు వంతులు.




ధ: ఏమిటీ?

బ: శతపతి - అర్థం కాలేదా! మనిషిలోనూ వుంటుంది మాంసం.

ధ: బలరామయ్యా ఆగు! (పట్టుకుంటాడు.)

బ: నువ్వెంత మొత్తుకున్నా అంతకన్నా ఎక్కువివ్వను! ఫో (తోసేస్తాడు. అతడు కింద పడిపోతాడు. గొంతుకోసిన మేకలా లోపల శతపతి కేక వినిపిస్తుంది. ధర్మారావు లోనికెళ్ళబోయి ఏదో తట్టి ఆగిపోయి ఆలోచిస్తూ నిలబడతాడు. బలరామయ్య శతపతి శవం చేయిపట్టుకుని బరబరా లాక్కువచ్చి, గది మధ్య పడేసి, మూలనున్న చెక్కలు పేర్చి కాగితం వెలిగిస్తాడు.)

(లైట్లారిపోతాయి.)

(బలరామయ్య ఎడమ తలుపు గుండా ఆవురిస్తూ వస్తాడు. చేతిలో కర్ర వుంటుంది.)

అంతసేపూ కునికిపాట్లు పడుతున్న ధర్మారావు కంగారుగా లేచి పక్కనున్న కర్ర అందుకుంటాడు.

బ: ఎందుకంత బయ్యం? ఆ కర్ర దేనికి?

ధ: నువ్వెందుకు పట్టుకు తిరుగుతున్నావో నేనూ అందుకే!

బ: నీకూ జబ్బు చేసిందా?


ధ: అంటే నీకు జబ్బు చేసిందా?

బ: ఔను. పొద్దున్నుంచీ ఒళ్ళు కాలిపోతున్నది. నీరసంగా వున్నాను కదాని ఎక్కడ మీదపడి గొంతు పిసుకుతావోననీ.

ధ: నా తల పగలగొడతావేమోననే ఇది దగ్గరుంచుకున్నాను. ఐతే నీకు జబ్బు చేసిందన్నమాట.

బ: ఔను. చేసింది. చేస్తే ఏం? నువ్వేం చేస్తావ్. ఏదయినా వెర్రి వేషాలు వేస్తావేమో, దగ్గరికొస్తే పుచ్చె ఎగరగొడతా ఏమనుకున్నావో

(అని మధ్య తలుపు గుండా వెళ్లబోతాడు. అతడ్ని గమనించడం కోసం వెనకు జరుగుతాడు ధర్మారావు.



కుర్చీకి కాలు తగలడంతో కిర్రు మంటుంది. బలరామయ్య అదిరిపడి వెనక్కి తిరిగి-

బ: ఏమయ్యింది?

ధ: కుర్చీ కదిలింది!

బ: కదిలింది లేవయ్యా! ఎందుకు కదిలిందో చెప్పమంటున్నా. నువ్వు నా మీదకు రాబోతూ దానికి కొట్టుకున్నావ్! ఔనా?

ధ: కాదు!

బ: కాదూ? కాదనగానే సరిపోతుందనుకున్నా. ఇదుగో ఇప్పుడే చెబుతున్నాను. కర్ర చేతిలో వుంటే పెద్ద మొనగాణ్ణయ్యాననుకుంటున్నావేమో, దగ్గరకొస్తే ప్రాణం తీస్తా!

(అంటూ మధ్య తలుపు గుండా వెళ్తాడు)

ధ: అసలే నిద్ర లేక చస్తూంటే పైన పీడి గోలొకటి! (లోపల కుండ బద్దలు కొట్టిన చప్పుడు. బలరామయ్య విసురుగా వస్తూ-)

బ: దాని తల్లి సిగదరగ, అదీ మోసం చేసింది!

ధ: ఏం జరిగింది?

బ: ఆ కుండ! ఆ కుండ లేదూ! మోసం చేసింది! వాటేసుక్కూర్చుంటే ఒళ్లు చల్లబడుతుంది కదాని వెళ్లా. అదీ వెచ్చబడింది. దాని బ్రతుకెంత!

ధ: (వెటకారంగా) అంతేలే దానికి బాగా బుద్ధి చెప్పావ్!

బ: (ఒక ఎముకను తంతూ) ఈ శతపతి గాడు పోయి అప్పుడే నాలుగు రోజులయింది. ''దుర్మార్గం చేసాం- దుర్మార్గం చేసాం' అంటూనే నీ వాటా అంతా స్వాహా చేశావ్! నువ్వు తినకుండా వుంటే నాకివ్వాళ్టిదాకా వచ్చేవాడు.

ధ: వచ్చేవాడు. కానీ నేను చచ్చేవాణ్ని. నన్ను పీక్కుతిని నువ్వు వుండేవాడివి.

బ: వుండాలంటే ఇప్పుడుండలేనా! నిన్ను చంపలేనా!

ధ: చంపలేకేగా ఏడుపు. శతపతంటే బలహీనుడు, అమాయకుడు కాబట్టి చంపగలిగావు. నేను నీకు తీసిపోననీ, తగాదా పడితే గెలుపు అదృష్టానిదేనని భయపడుతున్నావ్. నేను పేపరు తింటున్నప్పుడు చంపబోయావంటే అది నీ గొప్ప కాదు. అప్పటి ఆవేశం నీకు బలాన్ని, ధైర్యాన్ని ఇచ్చింది. కాని ఇప్పుడాలోచిస్తున్నావ్. వాస్తవాన్ని తెలుసుకున్నావ్. అందుకే నన్నేమీ చెయ్యలేక చూస్తూ వురుకున్నావ్.

బ: ఆహా! అలాగేం?

ధ: అంతే. నువ్వు చేసిన పొరపాటల్లా శతపతిని ముందు చంపడం. అప్పుడు నువ్వు ఆలోచించి వుంటే శతపతితో లాలూచీ పడి ముందు నన్ను చంపేవాడివి. ఆ తరువాత శతపతిని చంపేవాడివి.

బ: నిజమే!

ధ: ఆవేశం అప్పటి అవసరాన్ని తీరుస్తుంది గాని ముందు చూపు లేకుండా చేస్తుంది. ఇక నువ్వు నన్నేమీ చెయ్యలేవు. నేనూ అన్నిటికీ సిద్ధంగానే వున్నాను.

బ: ఉన్నావ్. వుండబట్టేగా నాకు నిద్ర లేకుండా పోయింది. శతపతి వుండగానే నయం, తిండి లేక పోయినా కంటినిండా నిద్రయినా వుండేది.

ధ: ఇప్పుడేమయింది, నిద్రపో.

బ: పోవాలేం? పోతే మళ్లీ లేవనిస్తావా? (దీనంగా) లోపల గొళ్లెం వేసుకు పడుకుందామంటే వుక్కపోసి నిద్ర రాదు. రాక రాక వస్తే పీడకలలు వచ్చి వెంటనే మెలకువ వచ్చేస్తుంది.

ధ: ఇంతా చేసి చివరకు నిద్రలేకుండా చస్తాం కాబోలు.

బ: చావడమా! లేదు నేను చావను నేను చావను (ఉద్రేకంగా ధర్మారావు వైపు నడుస్తాడు)

ధ: (కర్రెత్తి) ఆగు! తొందరపడి ప్రాణాలు ఒదులుకోకు. (బలరామయ్య నిరాశగా వెనక్కి వెళ్ళి ఒక చోట




చతికిలబడతాడు. కుర్చీ కిర్రుమంటుంది. బలరామయ్య కంగారుగా లేస్తాడు)

ధ: భయం లేదులే! కూర్చున్నా కదూ! కుర్చీ చప్పుడు చేసింది.

బ: దీనమ్మ కడుపు కాల... నా ప్రాణానికిదొకటి దాపురించింది బావగారూ! నాకు నిద్ర ఆగడం లేదు. కాసేపు మీరు పడుకుంటే నేనూ నడుం వాలుస్తాను. దయచేసి పడుకోండి మీకు పుణ్యం వుంటుంది.

(బలరామయ్య అసహాయత ధర్మారావుని చెప్పగొడుతుంది)

ధ: పుణ్యం- పాప పుణ్యం (వెటకారంగా నవ్వుతాడు) అవి అసహాయులు, అర్భకులు ప్రజల్ని మోసం చేసే నాయకులు వాడే మాటలు. ప్రస్తుతానికి నువ్వు అర్భకుడివి. నన్నేమీ చెయ్యలేని అర్భకుడివి. నీ శక్తి మీద నమ్మకం సన్నగిల్లిన అర్భకుడివి (అని పగలబడి నవ్వుతాడు)

బ: ఎందుకు బావగారూ అలా నవ్వుతారు? నవ్వకండి. నాకు భయమేస్తుంది.

ధ: అందుకే నవ్వుతున్నాను. నన్ను చూసి భయపడుతున్నందుకే నవ్వుతున్నాను. నన్ను చంపబోయిన చేతులు భయంతో వణకాలి! నన్ను చంపబోయిన మనిషి భయంతో చావాలి. అప్పుడే నాకు తృప్తి. అప్పుడే నాకు తృప్తి (పిచ్చిగా నవ్వుతాడు. పొలమారుతుంది. దగుతూ కుడివైపు తలుపుగుండా వెళతాడు)

బ: ఏకు లాంటివాడు మేకయ్యాడు (వణుకు వస్తుంది) ఏమిటి ఇలా ముంచుకొచ్చింది చలి? (వెళ్ళి కుర్చీలో కూర్చుంటాడు. వణుకు ఎక్కువవుతుంది. లేచి వెళ్ళి శతపతి చొక్కా తలకు చుట్టుకుంటాడు. పైజామాతో చేతులు కప్పుకుంటాడు) అబ్బా ఇవి గుచ్చుకుంటున్నాయ్! ఇవి గుచ్చుకుంటున్నాయ్ (అంటూ తీసిపారేస్తాడు) ఎక్కడిదా నవ్వు? ఎవరిదా నవ్వు? శతపతీ నువ్వా? నవ్వకు శతపతీ! నవ్వకు! నీ నవ్వు వల్లే నాకు జబ్బు చేసింది. నీ నవ్వుల్తో నా గుండె తూలు పడ్డది. నవ్వంటేనే భయమేస్తుంది. ఇక నవ్వక శతపతీ. కావాలంటే ఒక్కసారిగా చంపేయి, కానీ నవ్వక శతపతీ నవ్వకు (అంటూ చెవులు మూసుకుంటాడు) శతపతీ నువ్వు నాకే ఎందుకు కన్పిస్తావ్? నీ నవ్వు నాకు ఎందుకు విన్పిస్తావ్? నిన్ను నేను చంపానవా? చంపినవాణ్ణి నేనే అయినా చంపనిచ్చింది ఆ ధర్మారావ్! తిన్నా, తప్పు చేసినా ఇద్దరం కలసే చేశాం. వాడికీ వినిపించు నీ నవ్వు. వాడి గుండెలు అవిసిపోయేలాగా, జబ్బు చేసేలాగా నవ్వు. నవ్వు శతపతీ నవ్వు! ఏమిటీ, ఎందుకు నవ్వాలంటావా? నా కెందుకు సాయం చెయ్యాలంటావా? అవును ఎందుకు చేస్తావ్?- అందుకే అందుకే నేను బ్రతికి బయటపడితే నీకు దేవాలయం కట్టిస్తాను. మా వూరి వాళ్ళంతా నిన్ను కొలిచేలా చేస్తాను. అందుకే నవ్వొదిలేయ్. వాణ్ణి పట్టుకో శతపతీ కనబడవేం? వెళ్ళావా? వెళ్ళు వెళ్ళి వాణ్ని పట్టుకో! ఇక వాడి ఆటకట్టు. ఇంక నేను నవ్వుతాను. వాడు భయంతో చచ్చేలా నవ్వుతాను (అంటూ పగలబడి నవ్వుతాడు)

ధ: (వచ్చి) బలరామయ్యా, బలరామయ్యా ఏమిటా నవ్వు?


బ: ఇది మామూలు నవ్వు కాదు, మృత్యుదేవత నవ్వు (నవ్వుతాడు)

ధ: ఆపు! ఆపుతావా లేదా?

బ: ఏం భయంగా వుందా?

ధ: నా కెందుకు భయం? నీకు జ్వరం పెరిగినట్టుంది.

బ: లేదు! నాకు జ్వరమూ లేదు, భయమూ లేదు! అన్నీ పోయాయి. కాదు నవ్వింది నీ కోసం. నీ కోసం



నవ్వుతాను.

ధ: అంటే

బ: (వెక్కిరింతగా) అంటే- అందుకే. నువ్వింతదాక ఎందుకు నవ్వావో అందుకు.

ధ: నేను నిలకడ తప్పి నవ్వాను.

బ: కాదు నన్ను చంపాలని నవ్వావు.

ధ: ఓహో! అయితే నీ నవ్వుతో నన్ను చంపాలనా?

బ: ఆ (నవ్వుతాడు)

ధ: సరే కానియ్! అలా నవ్వి నవ్వి చావు!

బ: చావాలా? నేను చావాలా! నాకు జబ్బు పోయింది. బలం వచ్చింది. నేను చావను! నేను చావను (ధర్మారావ్‌పై దూకుతాడు)

ధ: (కర్ర పైకెత్తుతాడు)

బ: (అతడి చెయ్యి పట్టుకుంటాడు. ధర్మారావ్ అతడ్ని తోసేస్తాడు. బలరామయ్య పడిపోతాడు. చెక్కల దగ్గర కర్రందుకుంటాడు) దగ్గరకు రాకు నా దగ్గర కర్రుంది. (వణుకు వస్తుంది) మళ్లీ వణుకు వస్తుంది. నా జబ్బు పోలేదు. దేవాలయం కట్టిస్తానన్నా శతపతి నన్ను వదల్లేదు. బావగారూ మీకు దేవాలయం కట్టిస్తాను. మీరు మాత్రం నవ్వకండి!

ధ: నవ్వన్లే. లోపలికెళ్ళి కాసేపు పడుకో.

బ: ఒంటరిగా వుండలేను, వుండలేను.

ధ: పోనీ ఇక్కడే పడుకుంటావా?

బ: మీరూరుకుంటారా? నేను పడుకోను, పడుకోలేను.

ధ: పడుకోక వస్తావా?

బ: చావా? నాకా? లేదు. నేను చావను. (ఏడుస్తూ తలుపు ఎడమ గుండా వెళ్తాడు. తలుపు బాదుతున్న చప్పుడు. కాసేపటికి తిరిగి వస్తాడు) వాళ్ళు రావడం లేదు. బావగారూ మనం చావాల్సిందేనేమో. ముందు నేను వచ్చిపోతాను. నేనే వచ్చిపోతాను (అంటూ వెళ్ళి కుర్చీలో కూర్చుని ఏడుస్తాడు. ధర్మారావు దూరంగా వెళ్ళి కూర్చుంటాడు. కునికిపాట్లు మొదలవుతాయి. ఒకసారి తల విసురుగా కిందికి వాలుతుంది. కంగారుగా బలరామయ్య వైపు చూస్తాడు)

ధ: బలరామయ్యా! బలరామయ్య పడుకున్నట్టున్నాడే.

బ: (కలవరింత) శతపతీ నన్నొదిలేయ్! నీ నిలువెత్తు బంగారు విగ్రహం పెట్టిస్తాను. ఏమిటీ నీ పెళ్లాం విగ్రహం కూడా పెట్టించాలా? సరే సరే అలాగే పెట్టిస్తాను. నా ఆస్తంతా పోయినా చందాలు తెచ్చయినా, లంచాలు పుచ్చుకునయినా మీ ఇద్దరి విగ్రహాలు పెట్టిస్తాను. ఇక వెళ్ళు! వెళ్ళు! వాడ్నిల ధర్మారావుగాడ్ని పట్టుకో. వాడ్ని చంపేయాలి. వాడ్ని చంపేయాలి. వెళ్ళు.

ధ: (కోపంతోవణికిపోతాడు) చంపుతావు. రేపో మాపో జబ్బు తగ్గుతుంది. అప్పుడవకాశం చూసుకుని చంపుతావు. ఆ అవకాశం నేనెందుకివ్వాలి? అంతదాకా నిన్నెందుకు బతకనివ్వాలి (అని గొంతు పిసకడానికి చేతులు చాపుతాడు). చంపలేను. చంపేంత ఆకలీ, ఆవేశమూ నాలో లేవు. కానీ చంపకపోతే నా గతేమవుతుంది. ఇలాంటి అవకాశం మళ్లీ రాదు. చంపాలి. చంపి తీరాలి (చేతులు చాపుతాడు.)

బ: శతపతీ చంపకు, నన్ను చంపకు (లేస్తాడు) బావగారూ! (వెంటనే కర్ర అందుకుని దూరంగా జరుగుతాడు. ధర్మారావు వెంటబడుతాడు) ఆగు నా దగ్గర కర్రుంది.

ధ: నాకు బలముంది.

(మీద పడతాడు! పెనుగులాడతాడు. కర్ర పడిపోతుంది. బలరామయ్య తప్పించుకుంటాడు)

ధ: నన్ను తప్పించుకోలేవు.

బ: (ఏడుస్తూ) బావగారూ నన్ను చంపకండి. మీ చెల్లెల్ని, పిల్లల్ని తలచుకునయినా నన్ను చంపకండి, ఆగండి బావగారూ! ఆగండి.

ధ: బా... వ... గా... రు...

(కసిగా నవ్వుతూ మీదకెళ్తాడు. వెనక్కెళ్లడానికి వీలు లేకుండా గోడ తగులుతుంది. ధర్మారావు దగ్గరకొస్తాడు. ధర్మారావు గొంతు పిసికేస్తాడు. బలరామయ్య తల వాలిపోతుంది. ధర్మారావు వదిలేస్తాడు. బలరామయ్య కుప్పలా కూలిపోతాడు. బయట తలుపులు



తెరచిన చప్పుడు, బూట్ల టక టక, **Inspector** గదిలోకి వస్తాడు. అక్కడి దృశ్యాన్ని చూసి స్థాణువై పోతాడు)

ఇ: మీరా...

ధ: ఇన్‌స్పెక్టర్ అంతా అయ్యాక రావడం మీకు రివాజు కాబోలు.

ఇ: **No. No. No.** మా కివాళే వార్త తెలిసింది. మిమ్మల్ని ఇక్కడ వుంచిన సంగతి గజపతి, జోగారావులకి మాత్రమే తెలుసు. వాళ్ళల్లో వాళ్ళకేవో **Differences** వచ్చాయట. జోగారావుని **Murder** చేసి గజపతి పారిపోయాడు.

ధ: ఆవేశం మనుషుల్ని మూర్ఖులుగా చేస్తుంది.

ఇ: నిన్న బొంబేలో గజపతిని అరెస్టు చేశారు. మాకు ఇవ్వాళే మీ సంగతి తెలిసింది. వెంటనే బయల్దేరి వచ్చాం.

ధ: మీరు రాకుండా వుంటేనే బాగుండేది ఇన్‌స్పెక్టర్. నేను ఈ ప్రజల దృష్టిలో మనిషిగానే చచ్చిపోయేవాడ్ని. కానీ ఇప్పుడు వాళ్ళ దృష్టిలో రాక్షసుడ్నవుతాను. వాళ్ళు తండోప తండాలుగా వచ్చి చూడదగ్గవాడ్నవుతాను.

ఇ: ఏమిటి మీరనేది?

ధ: అర్థం కావడంలే ఇన్‌స్పెక్టర్? ఔను అర్థం కాదు. మీరే కాదు, ఎవ్వరూ ఊహించలేరు. చెప్పినా నమ్మలేరు. మీకు చెబుతాను. మనుషుల కళ్ళు తెరిపించే ఈ సంఘటన మరుగు పరచలేను. అటు చూడండి ఆ పుర్రె, ఎముకలు. ఎముకలు శతపతివి. అతడ్ని మేము చంపాం! చంపుకు తినేశాం! ఇన్‌స్పెక్టర్ చంపుకు తినేశాం!

ఇ: వాట్ (కళ్ళు తేలేసి నోరు తెరుస్తాడు)

ధ: (అతడి భుజం మీద చెయ్యి వేసి) నమ్మడం లేదా, మామూలుగా అయితే శవం ఇంత త్వరగా ఎముకల రూపంలోకి రాదు కదా?

ఇ: నిజమే (భయపడి దూరంగా జరిగి పిస్టల్ తీస్తాడు. మనిషి వణికి పోతూంటాడు)

ధ: భయపడకండి. నేను మిమ్మల్నేమీ చెయ్యను! మీరు రాగానే నేనీ ప్రపంచంలో పడ్డాను. మళ్ళీ ఇదివరకటి ధర్మారావు నయ్యాను. ఇప్పుడు హత్య చేసే శక్తి నాలో లేదు. నాగరికత, వివేకం, సంస్కారం అడ్డుపడుతున్నాయి.

ఇ: మీరు నిజంగా (మాట్లాడలేక నీళ్ళు నములుతూ ఎముకలవైపు చూపిస్తాడు)

ధ: తిన్నాను. బతకడానికి తిన్నాను. మీరు రావడం ఆలస్యమయితే ఈ బలరామయ్యనూ తినేవాడ్ని.

ఇ: మీలో... మీలో మానవత్వం లేదా?

ధ: (పగలబడి నవ్వుతాడు. అంతలో కోపం ముంచుకొస్తుంది. మానవత్వం! మానవత్వం అంటే ఏమిటి ఇన్‌స్పెక్టర్. మనిషిని మనిషి దోచుకుతినడం. మానవత్వం శ్రమ రూపంలో రక్త మాంసాల్ని పీల్చుకు తినడం మానవత్వమా? మాట్లాడరేం? అవును ఏం మాట్లాడతారు? మీరే కాదు దోపిడి సమాజానికి తల వంచి బానిసత్వానికలవాటు పడ్డ వాళ్లెవరూ మాట్లాడలేరు. వాళ్లకి మేము భయంకరంగా కన్పిస్తామే గాని వాళ్ళ పొట్టలు కొట్టేవాళ్ళు భయంకరంగా కన్పించరు. నిజానికి వాళ్ళు ఆ ధనవంతులు చేసిందానితో పోలిస్తే మేము చేసింది తప్పు కాదు ఇన్‌స్పెక్టర్. తప్పుకాదు (గాద్గదికంగా) కానీ, కానీ, మేము చేసింది ఎంతఅమానుషమో నాకు తెలుసు ఇన్‌స్పెక్టర్. అప్పుడు ప్రవర్తించానంటే వశం తప్పి, వివేకం కోల్పోయి ప్రవర్తించాను. ఇప్పుడు నా వివేకం మేల్కొంది. నన్ను నేను సమర్థించుకొనేది మనుషుల్లో, ఆ ధనవంతుల్లో ఒకడ్ని కావడానిక్కాదు. బయట వున్న రోజుల్లో వాళ్ళు చేస్తున్న అన్యాయాలు ఎత్తి చూపి విమర్శించి, నిరసించిన నేను ఇప్పుడు నన్ను నేను సమర్థించుకుని వాళ్లలో ఒకడ్ని కాలేను. అలాంటి మనిషిగా బతకలేను. ఆ మానవత్వం నాకొద్దు ఇన్‌స్పెక్టర్, నా కొద్దు (అంటూ పిస్టల్ లాక్కుని పేల్చుకుంటాడు) ఇప్పుడు చెప్పండి ఇన్‌స్పెక్టర్? శ్రమ రూపంలో మనుషుల్ని పీల్చి పిప్పి చేసి, పెద్ద మనుషులుగా చలామణి అవుతూ, కీర్తి ప్రతిష్టలతో కులుకుతున్న వాళ్ళు పెద్ద మనుషులా, చేసిన తప్పుకు చేతులారా శిక్ష విధించుకున్న నేను మనిషినా? ఎవరిది... మానవత్వం ఇన్‌స్పెక్టర్! ఏది మా..న..వ..త్వ..ం?

(ఒరిగిపోతాడు. ఇన్‌స్పెక్టర్ ఆలోచిస్తూ శూన్యంలోకి చూస్తుంటాడు)